క్లుప్తంగా

ప్రభుత్వ భూమిని ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించాలి



డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ శివారులో గల ప్రభుత్వ భూమిని ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజా పంథా) పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మురళి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలో ఘన్‌పూర్ గ్రామానికి చెందిన ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. నాయకులు సాయగౌడ్, మోహన్, కిషన్, భాగ్య, శారద, ఒడ్డెన్న, సుజాత, జమున, లక్ష్మీ, గంగామణి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



ఇందల్వాయి: వైద్య సిబ్బంది ప్రజారోగ్యంపై అప్రమత్తంగా ఉంటూ పల్లెల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా మలేరియా అధికారి తుకారం రాథోడ్ అన్నారు. ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆరోగ్య సిబ్బందికి ప్రజారోగ్యంపై పలు సూచనలు చేశారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారి వివరాలు గోప్యంగా ఉంచుతూ ప్రత్యేక వైద్య సేవలు అందించాలని అన్నారు. డెంగీ, మలేరియా వ్యాధుల పరీక్షలు వేగవంతం చేయాలని అన్నారు. హెచ్‌ఈవో శంకర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: ప్రజాపాలన– ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సమాచార వైద్య కౌన్సెలింగ్ వాల్‌పోస్టర్లను గురువారం అడిషనల్ డీఎంహెచ్‌వో దేవినాగేశ్వరి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, ఏఆర్టీ నోడల్ ఆఫీసర్ వీవీ రావు, ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్స్ శ్రీనివాస్ గౌడ్, ఇందూర్ ప్రవీణ్, చిటిమల్ల సంతోష్ కుమార్, డిస్ట్రిక్ ప్రోగ్రాం మేనేజర్ చెల్లా సుధాకర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఐడీ విచారణ చేపట్టాలి



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కాకతీయ పాఠశాలలో ఇటీవల జరిగిన విద్యార్థి జశ్వంత్ రెడ్డి మృతి ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని టీజీవీపీ నాయకులు కోరారు. ఈమేరకు వారు గురువారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. జశ్వంత్ రెడ్డి మరణానికి సంబంధించి పూర్తి నిజాలను వెలికితీయడానికి నిష్పక్షపాత విచారణ జరపించాలన్నారు. బాధిత కుటుంబానికి తక్షణ భద్రత కల్పించి, వారిని బెదిరింపుల నుంచి రక్షణ కల్పించాలన్నారు. నగర అధ్యక్షుడు అఖిల్, సుజిత్, మనోహర్, రియాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి కేజీబీవీ తనిఖీ



ఇందల్వాయి: మండల కేంద్రంలోని కేజీబీవీని తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలు కందాడి జ్యోత్స్న గురువారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంటశాలలను పరిశీలించారు. వంట సామగ్రిని తనిఖీ చేసి సిబ్బందికి పరిశుభ్రతపై, ఆరోగ్యకరమైన భోజనంపై పలు సూచనలు చేశారు. విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడి వసతులపై ఆరా తీశారు. విద్యార్థులు అసౌకర్యానికి గురైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 7 వరకు విద్యా కమిషన్ సభ్యులు జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఆమె వెంట ప్రత్యేకాధికారి వర్ష, ఉపాధ్యాయులు ఉన్నారు.

శ్రీనగర్ కాలనీలో అక్రమ నిర్మాణం!

- నగర బల్దియా అధికారులకు కాలనీవాసుల ఫిర్యాదు
- పనులను నిలిపివేయించిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది



శ్రీనగర్ కాలనీలో రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణం

నిజామాబాద్ సిటీ: నగరంలోని శ్రీనగర్‌కాలనీలో గల సాయినగర్‌లో చేపట్టిన ఓ అక్రమ నిర్మాణ పనులను బల్దియా అధికారులు గురువారం నిలిపివేయించారు. నగరంలోని పులాంగ్‌వాగు సమీపంలోగల గల్లీ రోడ్డును ఆక్రమించేందుకు కొందరు యత్నిస్తున్నట్లు స్థానికులు ఇటీవల బల్దియా అధికారులకు ఫిర్యాదుచేశారు. బుధవారం పులాంగ్‌వాగు రెయిలింగ్‌ను ఆనుకుని ఉన్న పెద్ద వృక్షాన్ని కట్టర్‌లతో తొలగించారు. దాని సమీపంలోనే 30 ఫీట్ల రోడ్డును ఆక్రమిస్తూ గదులు నిర్మిస్తున్న విషయం స్థానికులు తెలుసుకుని అభ్యంతరం తెలిపారు. అయినా నిర్మాణా పనులు చేయడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులకు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు. కమిషనర్ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ అధికారులు సదరు స్థలానికి వెళ్లి పనులపై ఆరా తీశారు. జరుగుతున్న పనులు నిలిపివేయించారు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు కార్పొరేషన్ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. సొంత స్థలంలో నిర్మాణాలు చేసుకోవాలంటే ముందస్తుగా అధికారుల అనుమతి కూడా తీసుకోవాలని సూచించారు.

సాహిత్య పురస్కారాల ప్రదానం



సమావేశంలో మాట్లాడుతున్న ఏనుగు నరసింహారెడ్డి

నిజామాబాద్ రూరల్: నవ్య భారతి గ్లోబల్ స్కూల్ ఆవరణలో బుధవారం రాత్రి హరిదా రచయితల సంఘం ఆరవ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా సరస్వతీరాజ్ హరిదా తెలంగాణ విశిష్టస్థాయి సాహిత్య పురస్కారం కవి, విమర్శకుడు ఏనుగు నరసింహారెడ్డి అందుకున్నారు. జిల్లాస్థాయి హరిదా సరస్వతీరాజ్ పురస్కారాలను అన్నం పద్మజారెడ్డి, కామినేని రేణుక, మఠం సుజాత, లక్ష్మణ్, మల్లవరపు చిన్నయ్యలకు అతిథులు బహూకరించారు. కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం నరసింహారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర సాహిత్య చరిత్రలో నిజామాబాద్ వేదికగా హరిదా చేస్తున్న కృషి, సరస్వతిరాజ్ అవార్డుల ప్రదానం సాహిత్యకారులకు వెన్నుదన్నుగా ఉంటున్నాయని అభినందించారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ.. తెలుగు సాహిత్య రంగంలో నరసింహారెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నాడని కొనియాడారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, పురస్కార ప్రదాత క్యాతం సంతోష్ కుమార్ మాట్లాడారు. తిరుమల శ్రీనివాస్ ఆర్య, మద్దుకూరి సాయిబాబు, కాసర్ల నరేష్‌రావు, గంట్యాల ప్రసాద్, నరసింహస్వామి, నరాల సుధాకర్, కందకుర్తి యాదవరావు, శిరీష్, సవితారాణి, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం వర్గీకరించాలి



మాట్లాడుతున్న ఎంజెఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: 15 శాతం ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లను ఎస్సీ జనాభా దామాషా ప్రకారం వర్గీకరించాలని మాదిగ జాగృతి సంఘం (ఎంజెఎస్) నిజామాబాద్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరరావు అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా రాష్ట్రాలలో ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రాష్ట్రంలో కూడా 15శాతంఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలన్నారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోగల ఎస్సీ జనాభాలో 70శాతం ఉన్న మాదిగ జనాభాకు 10 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి. 30శాతంలోపు ఉన్న మాలలకు 4శాతం రిజర్వేషన్లు కేటాయించాలని, 1శాతంలోపు ఉన్న ఎస్సీ ఉపకులాలకు ఒక శాతం రిజర్వేషన్లను కేటాయించాలన్నారు. దీనివలన ఇప్పటివరకూ ఈ రిజర్వేషన్ల ఫలాలను తగు రీతిలో అనుభవించని కులాలకు, జనాభా ప్రాతిపదికన సూచించిన విధంగా వర్గీకరించాలన్నారు. రిజర్వేషన్లు కేటాయించడం ద్వారా భారత రాజ్యాంగ మూల సూత్రమైన సామాజిక న్యాయాన్ని అమలు చేసినట్లు అవుతుందన్నారు. జిల్లా కమిటీ ప్రతినిధులు సంతోష్, బాగేంద్ర, రమేష్, సాయినాథ్, రాజు,వినోద్, సురేష్, గంగాధర్, రవి, కిరణ్ పాల్గొన్నారు.

ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలి



ధర్పల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: ఈనెల 7న చేపట్టనున్న ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో గురువారం బంద్‌కు సంబంధించిన పోస్టర్‌లను వారు ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.15వేలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోయిన ఆటో కార్మికులను ఆదుకోవాలన్నారు. మోటార్ వెహికల్ చట్టంలో సవరణ ఉపసంహరించుకోవాలని అన్నారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆటోల బంద్‌కు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు హనుమాన్లు, శ్రీనివాస్, జబ్బార్, షాదుల్, రఫీ ఖాన్, జావీద్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ధర్పల్లి: మండలకేంద్రంలో గురువారం 'ఆటోల బంద్'కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న రాష్ట్ర వ్యాప్త ఆటో, మోటార్‌ల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. బంద్‌లో కార్మికులు పాల్గొని, విజయవంతం చేయాలన్నారు. నాయకులు, ఆటో కార్మికులు హైమద్, రమేష్, చిన్న బాబు, లక్ష్మన్, నరేష్,జానీ, బాబురావు తదితరులున్నారు.

మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి
- నిజామాబాద్ బస్టాండ్‌లో ప్రజా విజయోత్సవ సభ



నగరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఖలీల్‌వాడి: మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. నిజామాబాద్ ప్రధాన బస్‌స్టాండ్‌లో గురువారం నిర్వహించిన ప్రజాపాలన– ప్రజా విజయోత్సవ సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గత ఏడాది డిసెంబర్ 9న ప్రారంభించిన మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి మంచి డిమాండ్ పెరిగిందన్నారు. గతంలో ఆర్టీసీలో బస్సుల్లో 45శాతం మంది ప్రయాణం చేసేవారని, కానీ ప్రస్తుతం పేద మహిళలు 66శాతం మంది ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. కొత్త ఆర్టీసీ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రీజినల్ మేనేజర్ జ్యోత్స్న మాట్లాడుతూ.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నవంబర్ వరకు 6కోట్ల మంది మహిళా ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించారన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి రూ. 223.60 కోట్లు వచ్చాయని తెలిపారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ సరస్వతి మాట్లాడుతూ.. గత సంవత్సరంలో 567 బస్సులతో ఉండగా, ప్రస్తుతం 582 బస్సులతో ప్రయాణికులకు సేవలందిస్తున్నామని తెలిపారు. డిపో మేనేజర్లు ఆనంద్, సాయన్న తదితరులు ఉన్నారు.

తిర్మన్‌పల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



తిర్మన్‌పల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పాల్గొన్న నేతలు

నిజామాబాద్ రూరల్: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో గురువారం సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, స్కూల్ ప్రహరీ నిర్మాణపనులకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుకుంటు వస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి మండలానికి ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ప్రారంభించబోతుందని అన్నారు. అంతకుముందు తిర్మన్‌పల్లి ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యను బోధించే అంశాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, హెచ్ఎం సీతాదేవికి పలు సూచనలు చేశారు. నాయకులు ఆగ్గభోజన్న, బాగిర్తి బాగారెడ్డి, మునిపెల్లి సాయిరెడ్డి, ఎల్లయ్య, కౌలాస్ శ్రీనివాస్, దాసరి శ్రీధర్, రాజేంద్రకుమార్, నిజాముద్దీన్, ఎంపీడీవో సుబ్రమణ్యం, హెచ్ఎం సీతాదేవి, శివలింగం పాల్గొన్నారు.



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తూ..

ఎల్‌వోసీ అందజేత

సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్ గ్రామానికి చెందిన దేగావత్ మోహన్‌కు గురువారం రూ. రెండు లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అందజేశారు. మోహన్ కూతురు వైద్య చికిత్స కోసం ఆయన ఎల్‌వోసీని మంజూరు చేయించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, సంతోష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

రుద్రూర్: తమ సమస్యలు పరిష్కారించాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. పోతంగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కరణ్‌కు గురువారం ఆశా కార్యకర్తలు వినతి పత్రం అందచేశారు. ఆశా యూనియన్ గౌరవ అధ్యక్షుడు నన్నేసాబ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో ఆశా కార్యకర్తల డిమాండ్లపై చర్చించాలన్నారు. రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

మట్టి పరీక్షలు చేయించాలి



మోపాల్: రైతులు తమ వ్యవసాయ భూముల్లోని మట్టికి తప్పకుండా పరీక్షలు చేయించాలని మట్టి నమూనా పరీక్ష కేంద్రం ఏడీఏ పద్మావతి సూచించారు. మండలకేంద్రంలోని మోపాల్ రైతు వేదికలో గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా మట్టి నమూనా సేకరణ, సేకరించే విధానంపై రైతులకు వివరించారు. పద్మావతి మాట్లాడుతూ.. రైతులు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వినియోగించడం వల్ల భూములు సారం కోల్పోతున్నాయని తెలిపారు. ఏఈవో రంజిత్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలి

నిజామాబాద్‌నాగారం: సీఎం కప్ టోర్నమెంట్‌కు సంబంధించి ఈ నెల 10 నుంచి 12 వరకు నిజామాబాద్ మున్సిపాలిటీ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు ఉంటాయన్నారు. క్రీడాకారులు పేర్ల నమోదుకు 97011 77144, 98667 70889, 78159 57048ను సంప్రదించాలన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో గురువారం అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు సామూహిక గణపతి పూజ, సుబ్రహ్మణ్య స్వామి పూజతో పాటు అయ్యప్ప స్వామికి ప్రత్యేకంగా పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అయ్యప్ప పాటలు పాడుతూ పేట తుళ్లై ఆటలు ఆడారు. అనంతరం అయ్యప్ప స్వాములకు, భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు.

ఆధ్యాత్మికం

గోశాల ప్రారంభం



డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ ఆలయంలో గురువారం సాయంత్రం నూతన గోశాల ప్రారంభించారు. ఈసందర్భంగా వేదపండితులు మహేశ్వర శర్మ నేతత్వంలో ఆలయ ప్రధానార్చకులు రాజేంద్రశర్మ త్రిపాఠి, వేదపండితులు గంగవరం ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గాలి శోభారాణి నాగరాజు, తడకమడ్ల చంద్రకళ భూమయ్య దంపతులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



మోపాల్: బోర్గాం(పి) 5వ డివిజన్‌లోగల వల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయం నవమ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రెండ్రోజులపాటు వార్షికోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానం, భజన కార్యక్రమాలు నిర్వహించనునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సెడ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,200	వెండి(కిలో)	96,000
22 క్యారెట్స్	73,075	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	32	50	గాజరుగడ్డ	50	70
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	25	40
జీరకాయ	30	50	దోసకాయ	30	50
దొండకాయ	40	80	ఆలుగడ్డ	35	50
బీర్నిసుకాయ	50	80	గోబిగడ్డ	25	50
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	90
వంకాయ	40	60	బీట్‌రూట్	50	90
పాలకూర	30	50	కరివేపాకు	50	70
మెంతికూర	50	70	చామగడ్డ	40	70
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	50	75
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.00,2.00, 6.00, 10.00

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.15 2.20 6.25 10.30
స్క్రీన్-2	పుష్ప-2(తెలుగు)-9.30,1.35, .5.40, 9.45
స్క్రీన్-3	పుష్ప-2(తెలుగు)-10.00,2.05, 6.10, 10.15
స్క్రీన్-4	పుష్ప-2(తెలుగు)-9.45,1.50, 5.55, 10.20
లలితామహల్	పుష్ప-2(తెలుగు)
దేవి	పుష్ప-2(తెలుగు)
నటరాజ్	పుష్ప-2 (హిందీ)
విజయ్	పుష్ప-2 (తెలుగు)

సంక్షిప్తం

ఆలయానికి రూ.లక్ష విరాళం



సిరికొండ: మండలంలోని లొంక రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం గురువారం సిరికొండకు చెందిన కనగందుల గోపి–దేవకి దంపతులు వారి పెళ్లి రోజు సందర్భంగా రూ.లక్ష విరాళంగా అందజేశారు. దాత దంపతులను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. గంగాధర్, లక్ష్మీనారాయణ, తాళ్ల శ్రీనివాస్, శేఖర్, దువ్వూరి సంతోష్‌రెడ్డి, సతీష్, శోభన్, పురోహితులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



సిరికొండ: మండలకేంద్రంలోని సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య గురువారం తెలిపారు. ఈ నెల 7నుంచి 9వరకు ఆర్మూర్‌లో జరిగే పోటీల్లో విద్యార్థులు సిద్దార్థ, రేవంత్ పాల్గొననున్నారు. ఈసందర్భంగా వారికి గురువారం అభినందించారు. ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, సంతోష్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఘ్నేష్ యాదవ్



నిజామాబాద్ సిటీ: యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకేంద్రానికి చెందిన నాయకుడు విఘ్నేష్ యాదవ్ ఎన్నికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 15 స్థానాల కోసం మొత్తం 97 మంది పోటీచేశారు. వారిలో విఘ్నేష్ యాదవ్ నాలుగో స్థానంలో నిలిచారు. ఆయనకు 26,500 మంది ఓటు వేశారు. నూతనంగా ఎన్నికైన విఘ్నేష్ యాదవ్‌ను పలువురు పార్టీ నాయకులు గురువారం అభినందించారు.

విద్యార్థుల ఉత్తమ ప్రతిభ



మోపాల్: మండలంలోని సిర్‌పూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ సృజన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను హెచ్ఎం సత్యనారాయణ అందజేశారు. పోటీల జిల్లా కన్వీనర్ కాసర్ల నరేష్‌రావు మాట్లాడుతూ.. చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో వివిధ పాఠశాలల్లో పోటీలు నిర్వహించామని, ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక సహకారం అందిస్తోందన్నారు. ఉపాధ్యాయులు శ్యామల, గాయత్రి, అక్బర్ బాషా, డాక్టర్ హజారే శ్రీనివాస్, లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టు సరికాదు..

నిజామాబాద్ రూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావును అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని, ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ నాయకులు అప్రతిష్టపాలు చేశారని జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులతో రానున్న రోజుల్లో కాంగ్రెస్ నాయకులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి

బోధన్‌టౌన్(బోధన్): రాష్ట్రంలోని ప్రభుత్వ అ స్పత్రులను బలోపేతం చేయాలని పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. ప ట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం వారు పరిశీలించారు. ఈసందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోదావరి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు అనీస్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు లే కపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. నాయకులు నవీన్ కుమార్, నాగమణి, నర్సక్క పాల్గొన్నారు.

డ్రా ద్వారా మడిగెల కేటాయింపు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని వీక్లీ బజార్‌లోగల రైతుబజార్‌లో నిర్మించిన మడిగెలను లబ్ధిదా రులకు లక్కీ డ్రా ద్వారా కేటాయిస్తామని ము న్సిపల్ కమిషనర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 29నుంచి డిసెంబర్ 4వరకు రైతు బజార్‌లో గల 58 మడిగెలకు దరఖాస్తులను స్వీకరించామన్నారు. 25మంది దరఖాస్తులు చేసుకున్నారు. కాగా ఈ 25మంది లబ్ధిదారులకు లక్కీ డ్రా ద్వారా మడిగెలు కేటాయిస్తామన్నారు. మిగిలిన మడిగెలకు త్వరలోనే మరోసారి టెండర్లు ఆహ్వానిస్తామన్నారు.